831) భైరవి

ప॥ పరిపూర్ణుడవు నీవు పరాకున్నదా నిన్ను | మరిగి వుండనిదే మావల్ల దప్పు గాకా ॥

చ॥ వినవా నీ వేమియైనా విశ్వమెల్లా వీనులే | యెనసి విన్నవించని యెడ్డతన మింతే కాక |
కనవా నీ విన్నియు నీ కన్నులే యెందు చూచినా | పనితో నా భావము చూపని నేరమి గాకా ॥

చ॥ పలుకవా నీ వేమియైనా బహుశబ్దమయుడవు | అలరి పిలువని నా యవివేక మింతే కాక |
నిలువవా నా ముందర నిఖిలస్వరూపడవు | తెలిసి చూడలేని సందేహ మింతే కాక ॥

చ॥ మన్నించవా నీవేమి మఱగు చొచ్చితి నంటే | పన్ని మత్తుడనై యున్న నా కర్మము గాక |
యిన్నిట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె | యిన్నాళ్ళెఱుగని భాగ్యమిట్టుండె గాకా ॥